నమస్తే తెలంగాణ

# వికారాబాద్

III హైదరాబాద్, గురువారం 24 ఏప్రిల్ 2025 | VIKARABAD


## ఎండ @ 42.2 డిగ్రీలు

### వికారాబాద్ జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదు

వికారాబాద్, ఏప్రిల్ 23 : ఎండలు రోజురోజుకూ మండుతున్నాయి. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఎండ వేడికి ప్రజలు ఇండ్ల నుంచి బయటికి రాలేకపోతున్నారు. బుధవారం వికారాబాద్ జిల్లాలో అత్యధికంగా 42.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ వేడికి ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. సాయంత్రం తర్వాత వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉరుములు, మెరుపులతో ఈదురుగాలులు వీచాయి. పట్టణంలోని రామయ్యగూడ ప్రభుత్వ పాఠశాల వద్ద విద్యుత్ తీగ తెగిపడగా.. విద్యుత్ అధికారులకు అక్కడికెళ్లి సరి చేశారు.



రామయ్యగూడ స్కూల్ వద్ద ఈదురు గాలులకు తెగిపడ్డ విద్యుత్ తీగ



బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ సమక్షంలో పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకులు

## భూభారతితో.. కొత్త చిక్కులు

### భూముల రిజిస్ట్రేషన్లు కావాలంటే సర్వే మ్యాప్ తప్పనిసరి అంటూ కొత్త చట్టంలో పేర్కొన్న ప్రభుత్వం

- ఇప్పటికే రంగారెడ్డి జిల్లాలో సర్వేయర్ల కొరత
- 27 మండలాలకు 11 మందే..
- ఒక్కొక్క సర్వేయర్ రెండు నుంచి మూడు మండలాలకు ఇన్‌చార్జి..
- సర్వేయర్లు లేకుండా మ్యాప్‌లు ఎలా సాధ్యమంటూ ప్రశ్న
- తమ భూములను సర్వే చేయాలని.. ఇప్పటికే తహసీల్దార్ కార్యాలయాల్లో 10,000 వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు
- భూభారతి చట్టం మరిన్ని సమస్యలు తెచ్చిపెడుతున్నదని అన్నదాతల ఆవేదన
- భూముల రిజిస్ట్రేషన్లూ ఆలస్యమయ్యే అవకాశం..!



రంగారెడ్డి, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ) : భూభారతి చట్టంలో భూముల రిజిస్ట్రేషన్లకు సర్వే మ్యాప్ తప్పనిసరి అని ప్రభుత్వం స్పష్టం చేయడంతో అది ఏ మేరకు సాధ్యమవుతుందనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. భూముల సర్వే కోసం జిల్లాలో వేలాది దరఖాస్తులు తహసీల్దార్ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఏండ్లు గడుస్తున్నా సర్వేకు నోచుకోకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే భూముల రిజిస్ట్రేషన్లకు సర్వే మ్యాప్ తప్పనిసరి అని ప్రభుత్వం కొత్త చిక్కులు తెచ్చిపెట్టిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 27 మండలాలకు 11 మంది సర్వేయర్లు మాత్రమే ఉన్నారు. ఒక్కొక్క సర్వేయర్ రెండు నుంచి మూడు మండలాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. సర్వేయర్లు లేకుండా మ్యాప్‌లు ఎలా సాధ్యమని అధికారులు.. రైతులను వేధిస్తున్న ప్రశ్న. భూ భారతి చట్టం.. భూముల సమస్యలకు పరిష్కారం చూపుతుందని అనుకుంటే మరిన్ని సమస్యలు తెచ్చి పెడుతున్నదని రైతులు వాపోతున్నారు. కొత్తగా సర్వేయర్లను నియమిస్తామని ప్రభుత్వం చెబుతున్నా ఆ నియామకం ఎప్పుడో కూడా స్పష్టత లేదు. దీంతో భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మరింత జాప్యమయ్యే అవకాశాలున్నాయి.

### ప్రైవేట్ సర్వేయర్లే కీలకం..

జిల్లాలో సర్వేయర్ల కొరత ఉండడంతో ఒక్కో సర్వేయర్ ప్రైవేట్ సర్వేయర్లను ఏర్పాటు చేసుకున్నారు. ప్రభుత్వ సర్వేయర్ అందుబాటులో లేనప్పుడు వారితో గ్రామాల్లోని రైతుల భూములను సర్వే చేయిస్తున్నారు. ప్రైవేట్ సర్వేయర్లు చేసిన సర్వే మ్యాప్‌లపై ప్రభుత్వ సర్వేయర్లు సంతకాలు చేయడంతోపాటు వారు రాసిన పంచనామాలనూ ధ్రువీకరించి ఇస్తున్నారు. గ్రామాల్లో ప్రైవేట్ సర్వేయర్లు ఇష్టానుసారంగా సర్వేలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా డబ్బులు ఇచ్చిన వారి భూములను సర్వే చేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

### పెండింగ్‌లో 10,000 దరఖాస్తులు

జిల్లాను కొంతకాలంగా సర్వేయర్ల సమస్య వేధిస్తున్నది. భూముల సర్వేకోసం జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో పెద్ద ఎత్తున దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆ అప్లికేషన్లు సుమారు 10,000 వరకు ఉంటాయని అధికారుల అంచనా.. ఒక్కొక్క సర్వేయర్ రెండు నుంచి మూడు మండలాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నాడు. ప్రభుత్వ భూముల సర్వేతోపాటు ఫ్యూచర్ సిటీ, గ్రీన్‌ఫీల్డ్‌రోడ్డు వంటి సర్వే పనులకూ వారినే వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో సర్వేయర్లు మండలాలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. 11 మంది సర్వేయర్లు జిల్లాలోని 23 మండలాలకు ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తున్నారు. దీంతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులే సర్వేకు నోచుకోవడం లేదు. కొత్తగా భూభారతిలో రిజిస్ట్రేషన్లకు సర్వే మ్యాప్‌లు అవసరం అని తెరపైకి రావడంతో అది ఏ మేరకు సాధ్యమవుతుందనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. మండలాల్లో భూముల సర్వేకోసం ప్రతిరోజూ రైతులు సర్వేయర్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మరికొన్ని చోట్ల ప్రైవేట్ సర్వేయర్లను పెట్టి భూముల సర్వే చేయించుకుంటున్నారు. ప్రైవేట్ సర్వేయర్లు చేసిన సర్వేమ్యాప్‌లపై ప్రభుత్వ సర్వేయర్లు సంతకాలు పెట్టి పంచనామా నకల్ కూడా ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి. మరోవైపు ప్రైవేట్ సర్వేయర్లు ఇష్టానుసారంగా సర్వే చేసి రైతుల మధ్య ఘర్షణలకు కారణమవుతున్నారన్న ఆరోపణలూ లేకపోలేదు.

### ఫ్యూచర్‌సిటీ, గ్రీన్‌ఫీల్డ్ రోడ్ల సర్వేకే అధిక ప్రాధాన్యం..

జిల్లాలో ఫ్యూచర్‌సిటీ ఏర్పాటవుతున్న నేపథ్యంలో ఫ్యూచర్‌సిటీ కోసం నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూములను సర్వే చేసేందుకే అత్యధిక మంది సర్వేయర్లను వినియోగిస్తున్నారు. దీంతో కొంతకాలంగా తహసీల్దార్ కార్యాలయాల్లో సర్వేయర్లే కనిపించడం లేదు. రైతుల భూములు సర్వే కావడమే లేదు. ఒక్కో రైతు తమ భూమిని సర్వే చేయాలని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఏడాది దాటుతున్నా సర్వే మాత్రం జరగడం లేదు.

### ఇరుగుపొరుగు వారితో గొడవలు జరుగుతున్నాయి..



రెండు నుంచి మూడు మండలాలకు ఒక్కో సర్వేయర్ ఇన్‌చార్జిగా ఉండడంతో అస్సలు దొరకడమే లేదు. దొరికినా సమయం లేదని ప్రైవేట్ సర్వేయర్‌ను భూములను సర్వే చేసేందుకు పంపిస్తున్నారు. వారు చేసిన సర్వేతో ఇరుగుపొరుగు వారితో తగాదాలు, గొడవలు జరుగుతున్నాయి. ప్రభుత్వం స్పందించి సర్వేయర్ల కొరతను నివారించాలి.

-మైలారం విజయ్‌కుమార్

### సర్వేయర్ల కొరతతో సమస్యలు



భూముల సర్వే కోసం దరఖాస్తులు చేసుకుని నెలల తరబడి తహసీల్దార్ కార్యాలయాలు, సర్వేయర్ల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేదు. తమ భూమిని సర్వేచేయాలని సంప్రదిస్తే.. ఇతర పనుల్లో బిజీగా ఉన్నామని.. సమయం పడుతుందని దాటవేస్తున్నారు. సర్వేయర్ల సంఖ్య తక్కువగా ఉండడంతో అన్నదాతలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రైవేట్ సర్వేయర్లను ఆశ్రయిస్తే ఇష్టానుసారంగా దండుకుంటున్నారు. -బూడిద నర్సింహారెడ్డి

## కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తం

- బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్
- బీఆర్ఎస్‌లో పలువురు కాంగ్రెస్ నాయకుల చేరిక

వికారాబాద్, ఏప్రిల్ 23 : కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తంగా మారిందని.. ప్రజలందరూ ఇబ్బంది పడుతున్నారని బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. బుధవారం ఆనంద్ నివాసంలో తొమ్మిదో వార్డుకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఆయన కండువాలు పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ..కాంగ్రెస్ పాలనలో ఉద్యోగులు, రైతులు, మహిళలు ఇలా అన్ని వర్గాల వారు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడం చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చూసి ప్రజలు ఛీదరించుకుంటున్నారని.. కేసీఆర్ ప్రభుత్వం వస్తేనే తమకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నారన్నారు. అనంతరం వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని తొమ్మిదో వార్డు బూరుగుపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు అనంత్‌రెడ్డి, పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వికారాబాద్ పట్టణాధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్, మాజీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు అనంత్‌రెడ్డి, శేఖర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు వెంకట్, శ్రీనివాస్‌రెడ్డి, వికారాబాద్ మండలాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, వికారాబాద్ పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షుడు సుభాన్‌రెడ్డి, వికారాబాద్ పట్టణ జనరల్ సెక్రటరీ మల్లికార్జున్, నాయకులు రమణ, నర్సింహ, అంజి, శివ, యాదయ్య, మహిపాల్, రాము, శ్యామ్, ప్రశాంత్ రెడ్డి, నర్సింహులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పహల్గాం మృతులకు కొవ్వొత్తులతో నివాళి



జమ్ముకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గాం పట్టణ సమీపంలో మంగళవారం పర్యాటకులే లక్ష్యంగా ఉగ్రవాదులు దాడికి తెగబడడంతో బుధవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా నిరసనలు వెలువెత్తాయి. భూతల స్వర్గం కశ్మీర్ సందర్శనకు వచ్చిన వారిపై దాడి చేసి ప్రాణాలను బలిగొనడం పిరికి పందల చర్య అని పలువురు మండిపడ్డారు. దాడి చేసిన ముష్కరులను వదిలిపెట్టొద్దని.. వేటాడి, వెంటాడి హతమార్చాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం రాత్రి రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలోని పూలే చౌరస్తాలో ప్రజా, మహిళా, యువజన సంఘాల నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.





వరంగల్‌లో ఈ నెల 27న జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవాన్ని సక్సెస్ చేయాలని కడ్తాల్ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేరుతో రాస్తున్న వాల్ పెయింటింగ్‌లను బుధవారం పరిశీలిస్తున్న సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి – కడ్తాల్

## తంత్ర పూజలంటూ.. నమ్మబలికి లక్షలు వసూలు చేసి



- యూపీలో అఘోరి అరెస్టు..
- నాగోల్ ఏసీపీ కార్యాలయంలో విచారణ
- చంచల్‌గూడ జైలుకు తరలింపు
- లింగ నిర్ధారణ పరీక్షలో ట్రాన్స్‌జెండర్‌గా..

చేవెళ్ల రూరల్ : శ్రీనివాస్ అఘోరి రిమాండ్ కథ ఎట్టకేలకు సుఖాంతమైంది. అఘోరి అవతారమెత్తిన శ్రీనివాస్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. మోకిలా సీఐ వీరాబాబు కథనం ప్రకారం.. శ్రీనివాస్ అలియాస్ అఘోరి మాత (28) గతంలో చెన్నై, ఇండోర్‌లలో లింగ మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. ఆధ్యాత్మిక దేవిగా ప్రచారం చేసుకొని.. పూజలు, మంత్రాల పేరుతో ప్రజలను మోసం చేస్తూ ఆర్థికంగా లబ్ధి పొందుతున్నాడు. ప్రొద్దుటూరులో ఓ మహిళకు దుష్టశక్తుల నుంచి రక్షించేందుకు తంత్ర పూజలు చేయాలని నమ్మబలికి రూ.లక్షలు వసూలు చేశాడు. తాంత్రిక శక్తులతో ఆమెను చంపేస్తానని హెచ్చరించాడు. భయపడిన బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. దీంతో అతడు యూపీకి వెళ్లగా అక్కడ అరెస్టు చేసి..నార్సింగి ఏసీపీ కార్యాలయానికి తీసుకొచ్చి విచారించారు. చేవెళ్ల ప్రభుత్వ దవాఖానలో వైద్యపరీక్షలు చేయించి.. చేవెళ్ల కోర్టులో న్యాయమూర్తి ముందు హాజరు పరిచారు. విచారించిన న్యాయమూర్తి నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు శ్రీనివాస్ అఘోరిని కంది జైలుకు తరలించారు. అక్కడి నుంచి మళ్లీ చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకు తీసుకువచ్చి, లింగ నిర్ధారణ పరీక్షలు చేయించారు. నిందితుడు ట్రాన్స్‌జెండర్‌గా నిర్ధారణ కావడంతో మెడికల్ రిపోర్ట్ తీసుకుని పోలీసులు మళ్లీ కోర్టుకు వెళ్లారు. వైద్యుల నివేదికను పరిశీలించిన న్యాయమూర్తి శ్రీనివాస్ అఘోరిని ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక బ్యారక్‌లు ఉన్న చంచల్‌గూడ జైలుకు తరలించాలని ఆదేశించారు. దీంతో ఊపిరి పీల్చుకున్న పోలీసులు ఎట్టకేలకు శ్రీనివాస్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. చేవెళ్ల కోర్టు ముందు మీడియాతో మాట్లాడిన అఘోరి తాను పోలీసులు, కోర్టుకు సహకరిస్తున్నానని చెప్పారు. చట్టం తన పని తాను చేసుకుపోతున్నదని స్పష్టం చేశారు.

## సర్వేలతోనే సరి..

### రైల్వే బ్రిడ్జిల నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం

- ఎన్నిసార్లు విన్నవించినా.. ఫలితం నిల్
- వికారాబాద్ జిల్లాలో 15 రైల్వేబ్రిడ్జిలను మంజూరు చేయాలని కొన్నేండ్లుగా వినతులు
- సర్వేలతోనే కాలయాపన చేస్తున్న మోదీ సర్కార్
- ఇప్పటివరకు ఒక్క వంతెన కూడా మంజూరు చేయని వైనం
- రైల్వేబ్రిడ్జిలు లేక ప్రమాదాల బారిన వాహనదారులు, పాదచారులు

వికారాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ) : రైల్వే బ్రిడ్జిల నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. జిల్లాలో రైల్వేబ్రిడ్జిలను నిర్మించాలని పలుసార్లు విన్నవించినా ఫలితం లేదు. దీంతో నిత్యం వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాకు 15 రైల్వే వంతెనలను మంజూరు చేయాలని కొన్నేండ్లుగా కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నా ఇప్పటివరకు ఒక్క బ్రిడ్జికి కూడా నిధులు మంజూరు కాలేదు. వికారాబాద్ పట్టణంలో తాండూరు వెళ్లే మార్గంలో, రామయ్యగూడ, గంగారం వద్ద.. తాండూరు పట్టణంలో పాత తాండూరుతోపాటు మరో రెండు చోట్ల.. అలాగే ధారూరు వద్ద, తరిగోపుల వద్ద, మర్పల్లి వద్ద, మొరంగపల్లి వద్ద, గేటువనంపల్లి వద్ద.. తాండూరు నియోజకవర్గంలోని బషీరాబాద్ మండల కేంద్రంతోపాటు పలు చోట్ల రైల్వే బ్రిడ్జిలను నిర్మించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

రైల్వేబ్రిడ్జిలు ఏర్పాటు చేయాలన్న ప్రతిసారీ సర్వేలు చేసి వదిలేస్తున్నారు. ఏండ్లు గడిచినా రైల్వే వంతెనల నిర్మాణం మాత్రం ముందుకు సాగడంలేదు. రైల్వే బ్రిడ్జిల నిర్మాణంలో మోదీ ప్రభుత్వం సర్వేలతోనే కాలయాపన చేస్తున్నదని జిల్లావాసులు మండిపడుతున్నారు. బ్రిడ్జిలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో వికారాబాద్ సమీపంలోని కొత్తగడి రైల్వేట్రాక్ వద్ద గేట్ లేకపోవడంతో వికారాబాద్ మండలంలోని మదన్‌పల్లి గ్రామానికి చెందిన ఓ కుటుంబానికి చెందిన ఐదుగురు వెళ్తున్న కారును రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. తదనంతరం స్పందించిన సంబంధిత శాఖ అధికారులు రైల్వే గేట్‌ను ఏర్పాటు చేశారు.



### కేంద్రానికి పట్టని జిల్లా ప్రజల కష్టాలు


ప్రతి ఏటా రైల్వే బడ్జెట్‌లో జిల్లాకు కేటాయింపుల విషయంలో ఎదురుచూపులే తప్పా ఒక్క రూపాయి కూడా విడుదల కావడం లేదు. ఎంఎంటీఎస్ వికారాబాద్ వరకు పొడిగింపుతోపాటు బుల్లెట్ రైలు తదితర ప్రాజెక్టులను పెండింగ్‌లో పెడుతున్నా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కనీసం రైల్వే బ్రిడ్జిలను కూడా నిర్మించేందుకు నిధులివ్వడం లేదు. రైల్వే బ్రిడ్జిలు లేకపోవడంతో అత్యవసర సమయాల్లో గేట్ పడితే 20 నిమిషాల నుంచి 30 నిమిషాల వరకు అక్కడ నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. తాండూరు నుంచి వికారాబాద్ మీదుగా హైదరాబాద్ వెళ్లే అంబులెన్స్‌ల్లో ప్రాణాపాయస్థితిలో ఉన్న రోగులున్నా బ్రిడ్జిలు లేకపోవడంతో రైల్వే గేట్‌ల వద్ద ఆగాల్సిన దుస్థితి ఉన్నది. అదేవిధంగా ధారూరు మండలంలోని తరిగోపుల సమీపంలో ఉన్న రైల్వే లైన్‌తో ఆ చుట్టు పక్కల గ్రామాల ప్రజలు చాలా కష్టాలు పడుతున్నారు. వంతెన లేకపోవడంతోపాటు కిలోమీటర్ మేర తిరిగి వెళ్లాల్సి వస్తున్నది. వర్షాకాలంలో అయితే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా బషీరాబాద్ మండల కేంద్రంలోనూ రైల్వే బ్రిడ్జి లేకపోవడంతో కిలోమీటరు మేర తిరిగి బషీరాబాద్ ప్రభుత్వ కార్యాలయాలతోపాటు జీవంగి తదితర గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

### కేసీఆర్ పాలనలో సాఫీగా ప్రయాణం

బీఆర్ఎస్ హయాంలో ఎక్కడైతే వాగులు పొంగిపొర్లి రవాణా స్తంభించే అవకాశముందో ఆ ప్రాంతాలను గుర్తించి వంతెనలు నిర్మించి ప్రజల ఇబ్బందులను తొలగించింది. జిల్లాలో ప్రధానమైన మూసీ, కాగ్నా నదులతోపాటు ఈసీవాగు ఆయా ప్రాంతాల్లోని ప్రధాన వాగులు, మారుమూల పల్లెల్లోని వాగులపై రూ. కోట్లు ఖర్చు చేసి బ్రిడ్జిలను నిర్మించడంతో ప్రజలకు కష్టాలు తప్పి రవాణా సాఫీగా సాగుతున్నది. కేసీఆర్ హయాంలో 31 వంతెనల నిర్మాణానికి రూ. 142 కోట్లకుపైగా నిధులను వెచ్చించారు.

### రైల్వే గేట్ పడితే అంబులెన్స్‌లకూ ఇబ్బందే..

రామయ్యగూడ రైల్వేగేట్‌తో వాహనదారులకు తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అత్యవసర సమయంలో రోగులను తీసుకెళ్లే అంబులెన్స్ లు కూడా గేట్ పడితే అక్కడ ఆగాల్సిన పరిస్థితి నెలకొన్నది. రోజుకు పదుల సంఖ్యలో రైల్వే గేట్ పడుతుండడంతో చుట్టు పక్కల కాలనీవారు, దూర ప్రాంతాలకు వెళ్లే వారు 15 నిమిషాల నుంచి 20 నిమిషాలపాటు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. రోజురోజుకూ వాహనాల సంఖ్య పెరుగుతున్నది. రైళ్ల రాకపోకలూ పెరిగాయి. తరచూ రైల్వే గేట్ పడుతుండడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి చర్యలు తీసుకోవాలి.



-ఎం.నాగయ్య, వికారాబాద్



వికారాబాద్ నుంచి తాండూరు వెళ్లే దారిలో ఉన్న రైల్వే గేట్ పడడంతో ఆగిన వాహనాలు..

### కేంద్రం స్పందించి.. బ్రిడ్జిలు నిర్మించాలి..

వికారాబాద్ పట్టణంలోని రామయ్యగూడ, అనంతగిరి రోడ్డు, గంగారం వెళ్లే దారుల్లో రైల్వే గేట్ ఉండడంతో.. రైళ్లు వచ్చి, వెళ్లే సమయాల్లో గేట్ వేస్తుండడంతో దాదాపుగా 20 నిమిషాల వరకు అక్కడ వాహనాలు ఆగాల్సి వస్తున్నది. అత్యవసరంగా వెళ్లే వారు ఇబ్బంది పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ప్రజలకు ఇబ్బంది కలుగకుండా వంతెనలు నిర్మించాలి.



-చంద్రశేఖర్, వికారాబాద్